
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
సోమవారం 4 ఆగస్టు 2025




పోటీల్లో యోగాసనం వేస్తున్న చిన్నారి


యోగాసనాలు వేస్తున్న నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు

మహిళలు ఆరోగ్యం కాపాడుకోవాలి

జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి

ముగిసిన అస్మిత సిటీ లీగ్ యోగాసన పోటీలు

7



మాట్లాడుతున్న డీపీవో దేవకిదేవి

కళ్లులేని కళాకారుడికి
జగ్గారెడ్డి రూ.5 లక్షల ఆర్థిక సహాయం

- సీఎం రేవంత్ రెడ్డితో చెప్పి ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు కృషి
- తన కూతురు జయారెడ్డి వివాహ వేడుకల సందర్భంగా వచ్చిన అంధ గాయకుడికి ఆసరా


కళ్లు లేని కళాకారుడు రాజుకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం చేస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి : తన కూతురు జయారెడ్డి వివాహ సంబరాల్లో భాగంగా ఆదివారం రాత్రి సంగారెడ్డి రామ్‌నగర్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంగీత విభావరి కార్యక్రమాన్ని తలపెట్టారు. ఈ మ్యూజిక్ షోలో రాజు అనే అంధ గాయకుడు అద్భుతంగా పాటలు పాడి అలరించాడు. చలించిన జగ్గారెడ్డి వెంటనే రాజుకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించారు. పేద కుటుంబానికి చెందిన రాజుకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కళ్లున్నవారు ఎలాగైనా బతుకుతారని కళ్ల లేని వారికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. ప్రముఖ గాయకుడు రామాచారి ఆధ్వర్యంలో సంగీత విభావరి అట్టహాసంగా జరిగింది. ఈ నెల 7న వివాహం సందర్భంగా జగ్గారెడ్డి కూతురు జయరెడ్డిని పెళ్లికూతురుగా ముస్తాబు చేశారు.


పెళ్లి కూతురుగా ముస్తాబైన జయారెడ్డితో కుటుంబ సభ్యులు


గజ్వేల్‌లో నిర్వహించిన దివ్యాంగుల సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

మోసంలో నంబర్ వన్

రేవంత్‌రెడ్డి పింఛన్లు పెంచుతావా.. రాజీనామా చేసి ఇంటికి పోతావా?

13న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు

గజ్వేల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మోసం చేయడంలో దేశంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నంబర్ వన్ అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గజ్వేల్‌లో నిర్వహించిన దివ్యాంగుల నియోజకవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ పోరాటంతోనే పింఛన్ అనేది పుట్టుకొచ్చిందని తెలిపారు. రూ.200 మొదలైన పింఛన్ మరోసారి ఎమ్మార్పీఎస్ పోరాటంతో రూ. 2016కు చేరిందని అన్నారు. వృద్ధులకు రూ.4,016 పింఛన్, దివ్యాంగులకు రూ.6,016 పింఛన్ ఇస్తానని చెప్పిన అధికారంలోకి వచ్చి 20 నెలలైనా ఇప్పటివరకు పెంచకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇచ్చిన మాట మీద రేవంత్‌రెడ్డి నిలబడని పక్షంలో అసెంబ్లీ వేదికగా, బయట నిలదీయాల్సిన ప్రతిపక్ష నాయకుడు ఫామ్‌హౌస్‌కే పరిమితమై ప్రజల ఆకాంక్షలను నీరుగారుస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా విఫలమయ్యారని.. ప్రజల ఆకాంక్షలను నీరు గార్చిన వీళ్లకి ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్‌ను పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13న ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ మహాగర్జన కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి పింఛన్ పెంచి ఇస్తాడా... లేదా రాజీనామా చేసి ఇంటికి పోతాడో చెప్పేలా ఈ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నేత కామల్ల భూమయ్య, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు మైసా రాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

భూ వివాదంతో రైతు ఆత్మహత్య

మద్దూరు, 3 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల భూ వివాదంతో మనస్తాపం చెందిన రైతు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మద్దూరు మండలం లద్నూరులో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామస్థులు, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శనిగరం ఎల్లయ్య(60), కిష్టయ్య అన్నదమ్ముల మధ్య భూ బాటకు సంబంధించిన వివాదం నడుస్తోంది. ఇద్దరు పంచుకున్న భూమిలో నుంచి తీసిన బాటను వాడుకుంటున్నారు. అన్న కిష్టయ్య ఒకటిన్నర ఎకరం కొనుగోలు చేసిన ఆ భూమిలోకి వెళ్లడానికి ఇదే దారిని వాడుకుంటున్నాడు. ఈ బాట విషయంలో ఇద్దరి మధ్య మనస్పర్ధలు కొనసాగుతున్నాయి. పెద్ద మనుషులతో పంచాయతీ జరిగినా తనకు తీర్పు వ్యతిరేకంగా రావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఎల్లయ్య ఆదివారం తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్లయ్య కుమారుడు శనిగరం రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ తెలిపారు. ఎల్లయ్యకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఉపాధి కోసం పల్లెబాట

వ్యవసాయ పనుల కోసం వెళ్తున్న కూలీలు

రోజూ ఆటోల్లో గ్రామాలకు

ఈజీఎస్ లేకపోవడంతో పనులు వెతుక్కుంటూ..

రోజుకు కూలి రూ.400

7

సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలో 25 రోజుల నుంచి యూరియా సరఫరా లేదు. మండలంలోని రెండు సొసైటీలకు 400 టన్నుల యూరియా మాత్రమే వచ్చింది. దీంతో రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లి అధిక ధరలు వెచ్చించి యూరియా బస్తాలు కొనుగోలు చేయాల్సిన అగత్యం ఏర్పడింది.

మెదక్ జిల్లా కౌల్చారం మండలంలో యూరియా లేదని పుకార్లు లేవడంతో రైతులు ఆగమాగం అవుతున్నారు. దీంతో రూ.266.50 విలువైన ఒక యూరియా బస్తాకు రూ.300 పైచిలుకు వెచ్చించి కొంటున్నారు. ఇంకొందరు వ్యాపారులు గుళికలు, ఫాస్పేట్, ఇతర మందులు తీసుకుంటేనే యూరియా బస్తా ఇస్తామని షరతులు విధిస్తున్నారు.

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఒక సొసైటీకి మాత్రమే యూరియా వస్తున్నది. ఎన్ని ఎకరాలున్నా ఒక రైతుకు ఒకట్రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. దీంతో మండలంలోని రైతులు తీవ్రస్థాయిలో ఆగ్రహిస్తున్నారు. పంటలు ఎర్రబారుతుండడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి ఒక బస్తాకు రూ.350 నుంచి రూ.380 దాకా చెల్లించి తెచ్చుకుంటున్నారు



చిన్నకోడూరులోని ఆగ్రోస్ కేంద్రం తెరవకముందే యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కొరత రైతులను తీవ్రంగా కలవరపెడుతోంది. ప్రస్తుతం వరి, మొక్కజొన్న, పత్తి మొక్కలు ఎదిగే దశలో ఉన్నందున పంటలను దక్కించుకునేందుకు సరిపడా యూరియా కోసం నానా అగచాట్లు పడుతున్నారు. సహకార సంఘాలు, ఆగ్రోస్, ఫర్టిలైజర్ దుకాణాల్లో సరిపడా నిల్వలు లేకపోవడం సమస్యగా మారింది. గడిచిన పదేళ్లలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇలాంటి పరిస్థితి తలెత్తలేదు. మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సరిపడా నిల్వలను రైతులకు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యూరియా కావాలయ్యా!

ఉమ్మడి జిల్లాలో తీవ్ర కొరత.. అన్నదాతల కలత

- పంట ఎదిగే వేళ అరకొరగా పంపిణీ
- వానాకాలం తొలినాళ్లలోనే ఇబ్బందులు
- అధిక ధరలకు కొనుగోలు చేస్తున్న రైతులు
- ఈ నెలాఖరులో మరింత అవసరం
- చేతులెత్తేస్తున్న అధికారులు, వ్యాపారులు
- మళ్లీ వర్షాలు కురిస్తే అంతే సంగతి!

యూరియా వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	అవసరం	కేటాయింపు
సంగారెడ్డి	38,772	23,923
సిద్దిపేట	40,000	16,939
మెదక్	26,000	12,000


అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నారని కౌడిపల్లిలో ఫర్టిలైజర్ దుకాణానికి జారీ చేసిన నోటీసు

సిద్దిపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఈ ఏడాది వానాకాలం సీజన్ ఉమ్మడి జిల్లాకు కలిసిరాలేదు. మే నెలలో సాధారణం వర్షాలు కురియగా, ఆ తర్వాత ముఖం చాటేశాయి. జూన్‌లో అప్పుడప్పుడు పలకరించగా జూలై నెలాఖరులో మోస్తారుగా పడ్డాయి. దీంతో పంటల సాగు నెమ్మదించి విస్తీర్ణమూ తగ్గింది. వరి పంటకు గడువు ముగియడంతో చాలామంది రైతులు వెనక్కు తగ్గారు. జూన్ నెలలో నాట్లు వేయాల్సిన దశలో జూలై నెలాఖరులో నాట్లు వేశారు. ఇప్పటికీ కొందరు వర్షాల కోసం ఎదురు

మిగతా 7వ పేజీలో


గజ్వేల్ పట్టణంలో లబ్ధిదారులకు రేషన్‌కార్డు ప్రొసీడింగ్‌ను అందజేస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి తదితరులు

- కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం
- పీసీ ఘోష్ రిపోర్టు ప్రకారం కఠిన చర్యలు
- గజ్వేల్ నియోజకవర్గంలో 3,947 కొత్త రేషన్‌కార్డులు
- మొదటి విడతలో జిల్లాకు 12 వేల ఇందిరమ్మ ఇళ్లు
- రాష్ట్ర కార్మిక శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి

మల్లన్నసాగర్‌కు ఎల్లంపల్లి నీళ్లు

గజ్వేల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మల్లన్నసాగర్ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ద్వారానే గోదావరి నీళ్లు వస్తున్నాయని, కాళేశ్వరం పంపింగ్ వృథా అయిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డు ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసం కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లను ఖర్చు చేశారని, మెగా ప్రాజెక్టులు మెగా కమీషన్ల కోసమే అన్నట్లుగా మారిందన్నారు. కాళేశ్వరం ద్వారా ఇప్పటివరకు 70 టీఎంసీల నీటిని తీసుకువచ్చినప్పటికీ ఆ నీళ్లు వృథా అయ్యాయన్నారు. వంద మీటర్ల పంపింగ్ చేయాలంటే సుమారు రూ.4 వేల కోట్ల విద్యుత్ అవసరమవుతుందన్నారు. గతంలో రూ.24 వేల కోట్లతో కాంగ్రెస్ కట్టిన ఎల్లంపల్లి ప్రాజెక్టే ఇప్పుడు దిక్కుగా మారిందన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో 3,947 కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామని, కొత్తగా 13,389 మందికి లబ్ధి చేకూరనుందని తెలిపారు. సెప్టెంబరు నుంచి కొత్త రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందుతాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఒక్క రేషన్ కార్డును ఇవ్వలేదని, వారిచ్చినవన్నీ రిప్లేస్‌మెంట్ కార్డులు మాత్రమేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నరలో నాలుగున్నర లక్షల రేషన్‌కార్డులు ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో 17 లక్షల ఇందిరమ్మ ఇళ్లను కట్టాలని నిర్ణయం తీసుకున్నామని, ప్రత్యేక నిధులు ఏర్పాటు చేశామన్నారు. సిద్దిపేట జిల్లాకు మొదటి విడతలో 12 వేల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. ఇప్పటికే 8 వేల ఇళ్లకు మార్కింగ్ ఇచ్చామని, 2 వేల మందికి రూ.లక్ష బ్యాంకు ఖాతాల్లో జమచేశామని తెలిపారు. మధ్యవర్తులు లేకుండా, పారదర్శకంగా పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, అదనపు కలెక్టర్‌లు గరిమా అగ్రవాల్, అబ్దుల్‌హమీద్, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, కార్పొరేషన్

మిగతా 8వ పేజీలో

మంత్రి సభలో రసాభాస

గజ్వేల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : గజ్వేల్‌లో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో రసాభాస నెలకొన్నది. ఈ కార్యక్రమంలో ప్రారంభం అయిన కొద్దిసేపటికే నర్సారెడ్డి వ్యతిరేక వర్గానికి చెందిన గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి స్టేజీపైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఒక్కసారిగా మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి వర్గీయులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. నర్సారెడ్డి వర్గీయులు స్టేజీపైకి చొచ్చుకువచ్చే ప్రయత్నం చేయగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి గజ్వేల్ ఏసీపీ నర్సింహులు వద్దకు

మిగతా 8వ పేజీలో


గజ్వేల్‌లో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో నినాదాలు చేస్తున్న నర్సారెడ్డి వర్గీయులు

పంచాయతీ కార్యదర్శులకు
'యాప్'సోపాలు

- పని ఒత్తిడి, నిధుల కొరతతో సతమతం

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 3 : జిల్లాలో పంచాయతీ కార్యదర్శులకు ఫేస్ రికగ్నిజేషన్ యాప్ (జీపీ మానిటరింగ్ యాప్) వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. యాప్‌లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ జిల్లాలోని 70 మంది పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ అయ్యాయి. ఈ చర్యపై కార్యదర్శులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పని ఒత్తిడి, నిధుల కొరతతో సతమతమవుతున్న తమపై నోటీసుల భారం మోపడం సరికాదని వాపోతున్నారు.

నిరసన తెలిపినా..

జిల్లాలోని 508 గ్రామపంచాయతీల్లో 470 మంది కార్యదర్శులు పనిచేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఒక కార్యదర్శి రెండు గ్రామాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. జీపీ మానిటరింగ్ యాప్ వచ్చినప్పటి నుంచి అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, పర్సనల్ డేటా హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని గతంలోనే నిరసన తెలిపినప్పటికీ యాప్‌ను ప్రవేశపెట్టి, తమపై ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చిందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధుల కొరతతో అప్పుల బాధ

గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం కార్యదర్శులు తమ సొంత డబ్బులు ఖర్చు చేసి అప్పుల పాలవుతున్నారు. నిధుల కోసం ప్రభుత్వం వైపు చూస్తున్నా ఎలాంటి స్పందన లేదని వారు ఆరోపిస్తున్నారు. కొందరు కార్యదర్శులు లక్షల రూపాయలు అప్పు చేసి గ్రామాల అభివృద్ధికి వెచ్చించగా, ఇప్పుడు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల సర్వే వంటి అదనపు పనులు తమపై భారం మోపుతున్నాయని వాపోతున్నారు. సిగ్నల్ సమస్యలు, వర్షం వంటి కారణాల వల్ల సమయానికి హాజరు నమోదు చేయడంలో జాప్యం జరుగుతోందని, దానిని దృష్టిలో ఉంచుకోకుండా నోటీసులు జారీ చేయడం సరైంది కాదని కార్యదర్శులు అంటున్నారు. మహిళా కార్యదర్శులకు రవాణా సౌకర్యాలు లేకపోవడం కూడా ఒక సమస్యగా మారింది. వీటిని పరిష్కరించకుండా యాప్ ఆధారంగా నోటీసులు ఇవ్వడంపై కార్యదర్శులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మనస్తాపంతో కార్మికుడి ఆత్మహత్య

చేగుంట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఓ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చేగుంట శివారులోని డంపింగ్ యార్డు వద్ద చోటుచేసుకుంది. చేగుంట ఎస్సై బిక్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆశిష్ కుమార్ (24) చిన్నశివనూర్ శివారులోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో ఐదేళ్లుగా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆశిష్ ఈ నెల 1న మందులు తెచ్చుకుంటానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆరోగ్యంనయం కాకపోవడంతో మనస్తాపం చెంది శనివారం రాత్రి వడియారం రైల్వే స్టేషన్ సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బిందేశ్వర్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆశిష్‌కుమార్ మృతదేహం



రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి తీవ్ర గాయాలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జరిగిన నాలుగు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. కోహెడ, చిన్నశంకరంపేట, నారాయణఖేడ్, చేర్యాల మండలాల పరిధిలో ఈ ఘటనలు ఆదివారం చోటుచేసుకున్నాయి.

- కోహెడ/చిన్నశంకరంపేట/నారాయణఖేడ్, చేర్యాల ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) :

● కోహెడ మండలం వెంకటేశ్వరపల్లి గ్రామంలోని పెద్దమ్మ ఆలయం వద్ద ఆదివారం ఆటో అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. కోహెడ గురుకుల హాస్టల్‌కు చికెన్, కూరగాయలు, పండ్లు, ఇతర వంట సామగ్రిని తీసుకెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్పందించిన స్థానిక రైతులు చికిత్స కోసం అతడిని కోహెడ ఆసుపత్రికి తరలించారు.

● నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ శివారులో 161బీ జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్నాయి. మనూరుకు చెందిన మేత్రినగేష్, గోర్నాల నర్సింహులు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసినా ఆలస్యం చేయడంతో అటుగా వెళ్తున్న పోతుల మహిపాల్‌రెడ్డి స్థానికుల సహాయంతో తన కారులో వారిని ఖేడ్ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు.



క్షతగాత్రులను ఖేడ్ ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చిన స్థానికులు

● చిన్నశంకరంపేట మండలం మెదక్-చేగుంట రహదారి గవ్వలపల్లి ఎక్స్‌రోడ్డు దగ్గర రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జంగరాయి గ్రామానికి చెందిన పున్న కల్యాణ్, ప్రవీణ్ గాయపడ్డారు. అలాగే గవ్వలపల్లికి మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మెదక్ ఆసుపత్రికి తరలించారు.

● జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధానరహదారిపై చేర్యాలలోని పాతబస్టాండ్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన మహ్మద్ స్వరాజ్ దంపతులు బైక్ వెళ్తున్నారు. పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాకేష్ బైక్‌పై వస్తుండగా రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాకేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పాముకాటుతో బాలిక మృతి

జోగిపేటరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జోగిపేట పట్టణంలో పాముకాటుతో బాలిక ఆదివారం మృతి చెందింది. పట్టణంలోని రెండోవార్డుకు చెందిన పిట్ల నవ్య(8) ఇంట్లో సోఫాలో కూర్చుని ఉండగా పాము కాటేసింది. విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు వెంటనే బాలికను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పరిస్థితి విషమించి నవ్య మృతి చెందింది. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



నవ్య (ఫైల్)

దుకాణాల్లో చోరీ.. నిందితుడి అరెస్టు

దుబ్బాక, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దుబ్బాకలో రెండు దుకాణాల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన దొంగను పోలీసులు24 గంటల్లోనే పట్టుకున్నారు. దుబ్బాక ఎస్సై కీర్తిరాజు నేతృత్వంలోని బృందాలు గాలింపు చేపట్టి చోరీకి పాల్పడిన చెక్కపల్లి శివకుమార్‌ను అరెస్టు చేశారు. శనివారం తెల్లవారుజామున గౌస్ మొబైల్, ఉదయకల్యాణ్ పెయింటింగ్ దుకాణాల్లో చోరీకి పాల్పడిన నిందితుడి నుంచి రూ. 80వేల విలువైన 10 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

అక్రమ మట్టి రవాణాకు అడ్డుకట్ట

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొల్చారం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కొల్చారంలో అర్ధ రాత్రి జరుగుతున్న అక్రమ మట్టి రవాణా ఆగిపోయింది. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మట్టి.. కొల్లగొట్టి' కథనంతో అనుమతులు లేకుండా వందలాది టిప్పర్ల ద్వారా తరలిస్తున్న మట్టిపై అధికారులు దృష్టి సారించారు. రిసార్ట్ నిర్మాణానికి లీజు పేరుతో మట్టిని తరలిస్తున్నట్లు తెలిసింది. అయితే, అధికారులు ఇచ్చిన పత్రాల్లో సమయం, మట్టి పరిమాణం, టిప్పర్ నంబర్లు లేకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

పొన్నాల బాలయ్యకు సినారె పురస్కారం



సినారె సాహిత్య పురస్కారం అందుకుంటున్న పొన్నాల బాలయ్య

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటకు చెందిన కవి, రచయిత పొన్నాల బాలయ్యకు ప్రతిష్టాత్మక మహాకవి సినారె సాహిత్య పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్‌లో సినారె కళాపీఠం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. పద్మభూషణ్, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి.నారాయణరెడ్డి 94వ జయంతి సందర్భంగా ఈ పురస్కారాన్ని అందజేశారు. సంస్థ అధ్యక్షుడు మల్లెకేడి రాములు, సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు డా.నందిని సిధారెడ్డి, కవి, రచయితలు బైస దేవదాసు, కాకుమాను సునీల్, దాసరి దయానందరెడ్డి, డా. పోరెడ్డి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి'



రిటైర్డ్ సైనిక అధికారులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సిద్దిపేట రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యుద్ధంలో సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని సీనియర్ జర్నలిస్ట్ కొమురవెల్లి అంజయ్య అన్నారు. ఆదివారం నారాయణరావుపేటలో రిటైర్డ్ సైనికాధికారులతో నిర్వహించిన 'సైనిక నీకు సలాం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రిటైర్డ్ సైనికాధికారులు మానేటి కిషన్‌డ్డి, ఐలేని స్కైలాబ్, అంబటి చంద్రమౌళి, జోజీ దనరిపల్లి, మారబోయిన రాగయ్య, గిరి శ్రీనివాస్‌రెడ్డిలు తమ అనుభవాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహచారి, శ్రీనివాస్‌రెడ్డి, రాజారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రెండు పతకాలు



పతకాలను చూపిస్తున్న గణేష్, సిరి చందన

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో సిద్దిపేట జిల్లాకు రెండు పతకాలు లభించాయి. అండర్ 20 రేస్ వాక్‌లో గణేష్ బంగారు పతకం సాధించగా, అండర్ 16 బాలికల జావలిన్ త్రోలో సిరి చందన వెండి పతకం గెలుచుకుందని సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల వెంకటస్వామి గౌడ్ తెలిపారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులను జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం, డీవైఎస్‌వో వెంకట నరసయ్య, సిద్దిపేట జిల్లా సైకిల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసులు, ఎస్జీఎఫ్ మాజీ సెక్రటరీ పన్యాల రామేశ్వర్ రెడ్డి, టీజీ పెటా జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామిరెడ్డి రవీందర్ రెడ్డి, శిక్షకులు ప్రభాకర్, నిశాంక్ గౌడ్, లక్ష్మణ్ అభినందించారు.

'మెక్కిన అవినీతి సొమ్మును కక్కించాలి'

● జీఎంపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్



మాట్లాడుతున్న ఉడుత రవీందర్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గొల్ల కురుమల సంక్షేమం కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకంలో మెక్కిన అవినీతి సొమ్మును కక్కించాలని గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో జీఎంపీఎస్ మూడవ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడుతూ ఈ అవినీతిలో పశుసంవర్ధక శాఖ అధికారులు, దళారులు లాభపడ్డారని ఆరోపించారు. ఏసీబీ విచారణలో రూ.700 కోట్లు, ఈడీ విచారణలో రూ.1,000 కోట్లు అవినీతి జరిగినట్లు వెల్లడైందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ఆపేందుకు కుట్ర చేస్తోందని, అలా జరిగితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. నాయకులు ఎల్లయ్య, శేఖర్, దాసరి కనకయ్య, బర్మ కొమురయ్య, ఈరు లింగయ్య, కొమురెల్లయ్య, బెడిదే బాల మల్లు, బెడిదే కొమరయ్య, వాసూరి స్వామి, ఆలేటి అంజనేయులు, వేల్పుల రాజు, ఇరుమల కుమార్, అల్ల శ్రీకాంత్, ప్రశాంత్, సత్తయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మ కొట్టింది.. పీఎస్‌లో బాలుడి ఫిర్యాదు



తండ్రితో కలిసి పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రాజు

వట్‌పల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తల్లి కొట్టిందని సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలానికి చెందిన 17 ఏళ్ల బాలుడు రాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శనివారం ఎరువుల బస్తాలను ఇంట్లో పెట్టమని తల్లి అనురాధ చెప్పగా, రాజు వినలేదు. దీంతో కోపంతో అనురాధ రాయితో కొట్టడంతో రాజు తలకు గాయమైంది. ఆదివారం తండ్రి దాసుతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన రాజును చికిత్స చేయించుకుని రావాలని పోలీసులు సూచించారు. అనంతరం రాజు తిరిగి వచ్చి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.1.94లక్షలకు టోకరా

రామాయంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : అధిక డబ్బు ఆశకు పోయి సొమ్ము గుల్ల చేసుకున్నాడు రామాయంపేటకు చెందిన వేముల సుజిత్. నగదు జమచేస్తే ఉద్యోగంతో పాటు రెట్టింపు ఇస్తామని అతనికి ఆదివారం రాత్రి మెసేజ్ వచ్చింది. దీంతో విడతలవారీగా రూ.1,94,000 ఆన్‌లైన్‌లో సైబర్ నేరగాళ్లక పంపాడు. తీరా మోసాన్ని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉపాధి కోసం పల్లెబాట

వ్యవసాయ పనుల కోసం వెళ్తున్న కూలీలు

రోజూ 50 ఆటోల్లో గ్రామాలకు

ఈజీఎస్ లేకపోవడంతో పనులు వెతుక్కుంటూ..

స్థానికంగా అవకాశాలు కరువు

రోజు కూలి రూ.400

ఆటోవాలాలే మధ్యవర్తులు



వ్యవసాయ పనులకోసం పల్లెలకు వెళ్లేందుకు ఆటోలో ఎక్కుతున్న మహిళా కూలీలు

హుస్నాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో పనులు లేకపోతే పట్టణానికి పోతారు. కాని ఇక్కడ పట్టణ కూలీలు పల్లెబాట పడుతున్నారు. ప్రస్తుతం పల్లెల్లో జరిగే వ్యవసాయ పనుల్లో హుస్నాబాద్ పట్టణ కూలీలే దర్శనమిస్తున్నారు. ప్రతి రోజు ఉదయాన్నే దాదాపు 50కి పైగా ఆటోల్లో 500 మంది వరకు పనుల కోసం కిలోమీటర్ల దూరం వెళ్లి వస్తున్నారు. కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి, హుస్నాబాద్ మండలాల్లో జరిగే వ్యవసాయ క్షేత్రాల్లో హుస్నాబాద్ పట్టణ కూలీలే అధికంగా కనిపిస్తున్నారు. ఇక్కడ ఉపాధి హామీ పనులు రద్దు చేయడం, హుస్నాబాద్ ప్రాంతంలో ఫ్యాక్టరీలు, ఇతర ఉపాధి కల్పనలు లేకపోవడంతో పల్లెలకు వెళ్లాల్సి వస్తున్నదని పలువురు పేర్కొంటున్నారు.

2013 నుంచి ఉపాధి పనులు బంద్

సెప్టెంబర్ 2011 సంవత్సరంలో మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న హుస్నాబాద్‌తోపాటు పలు జీపీలను నగరపంచాయతీగా అప్‌గ్రేడ్ చేశారు. 2013 సంవత్సరం వరకు ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించారు. ఆ తరువాత మున్సిపల్ నిబంధనల ప్రకారం నగరపంచాయతీల్లో ఈ పథకాన్ని రద్దు చేశారు. అనంతరం హుస్నాబాద్ నగరపంచాయతీ నుంచి మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. దీంతో ఉపాధి హామీ పథకాన్ని మొత్తానికి తీసివేశారు. దీంతో హుస్నాబాద్‌లో దాదాపు 850 కుటుంబాల్లోని 1893 మందికి ఉపాధి లేకుండా పోయింది. కుటుంబంలో నలుగురు ఉపాధి పనులకు పోతే రూ.900లకు పైగా కూలీ వస్తే కుటుంబ పోషణకు సరిపోయేది. కానీ ఇప్పుడు స్థానికంగా పని దొరకక వ్యవసాయ పనుల కోసం దూర ప్రాంతాలకు ఆటోల్లో వెళ్లాల్సి వస్తున్నది. మహిళలకు రూ. 400 నుంచి రూ.500 వరకు చెల్లిస్తున్నారు.

ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా..

మున్సిపాలిటీలో ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది. ఈ విషయమై బోయినిపల్లి వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్నప్పుడు పార్లమెంట్‌లో ప్రస్తావించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పలు మార్లు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైంది. ఇప్పటికైనా దిగువ శ్రేణి మున్సిపాలిటీల్లో అమలు చేసేందుకు కేంద్ర హోంశాఖ సహాయ కార్యదర్శి బండి సంజయ్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు చొరవ తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

పనులు లేకనే..



హుస్నాబాద్ మున్సిపాలిటీ అయిన నుంచి ఉపాధి పని బంద్ అయి గ్రామాలకు వ్యవసాయ పనులకు పోతున్నాం. పొద్దున ఆటోలో పోయి సాయంత్రం 5 గంటలకు ఇంటికి వస్తే రూ.350, రూ. 400 వరకు కూలి వత్తది. ఇక్కడ చిన్న పాటి ఫ్యాక్టరీలు కూడా లేకపోయే. మున్సిపాలిటీ అయితే మా బతుకులు ఏమన్నా మారినయా. ఉపాధి కూలీ పెడితే అందరికీ పని దొరుకుద్ది.

-రొల్ల భాగ్య, హుస్నాబాద్

30 మంది టీమ్‌గా పోతం..



ఇప్పుడు గ్రామాల్లోనే వ్యవసాయ పనులు దొరుకుతున్నయి. మేం 30 మందిమి కోహెడ, బస్వాపూర్, బెజ్జంకి వరకు ఆటోలల్లో పనులకు పోతన్నం. ఇక్కడ పనులుంటే అక్కడికి పోయే వాళ్లం కాదు. ఇప్పటికైనా గవర్నమెంట్ ఉపాధి హామీ పథకం పెట్టాలే..

-కానవేని మాధవి, హుస్నాబాద్

దూరాన్ని బట్టి కిరాయి..



హుస్నాబాద్ నుంచి ఊర్లలోని వ్యవసాయదారుల పనులకు కూలీలను తీసుకపోతే నాకు ఇంత కూలి గిట్టుబాటయితది. 20 కిలోమీటర్ల దాటితే రూ.2వేలు, దగ్గర అయితే రూ. 12వందలు ఇస్తరు. రోజు పనులకు తీసుకపోయి, మళ్లీ తీసుకొస్తా.

- భూక్య రాజు, ఆటో డ్రైవర్



సర్టిఫికెట్లు అందుకున్న విజేతలతో నిర్వాహకులు

మహిళలు ఆరోగ్యం కాపాడుకోవాలి

● సిద్దిపేట జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించడంతో పాటు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి సూచించారు. సిద్దిపేటలో జరిగిన అస్మిత సిటీ లీగ్ యోగాసన పోటీల ముగింపు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ పోటీల్లో 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారని కాంపిటీషన్ డైరెక్టర్ తోట సంధ్య తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శులు నిమ్మ శ్రీనివాసరెడ్డి, కొమురవెల్లి అంజయ్య, చీఫ్ పాట్రన్ చిప్ప ప్రభాకర్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి విక్రమ్ రెడ్డి, సంస్కారభారతి అధ్యక్షురాలు లక్కిరెడ్డి విజయ, చింత శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

విజేతల వివరాలు..

అండర్ 18 ట్రెడిషనల్ యోగాసన: భూమిక (వనపర్తి), వైష్ణవి (జెడ్పీహెచ్ఎస్ నారాయణరావుపేట), హర్షిణి (జెడ్పీహెచ్ఎస్ మర్పడగ), సాహితీ (టీజీఎస్ఆర్ మిట్టపల్లి), అర్చన (మర్పడగ).

ఎబోవ్ 18 ట్రెడిషనల్ యోగాసన: వి. శ్రీలత (సిద్దిపేట), సంగీత (నర్సింగ్ కాలేజీ సిద్దిపేట), కె. కిరణ్మయి (ఇందూరు కాలేజీ), హిమబిందు (ఇందూరు కాలేజీ), ఎం. అక్షయ (నర్సింగ్ కాలేజీ).

అండర్ 18 సుపైన్ ఇండివిడ్యువల్ యోగాసన: డి. మౌనిక (వనపర్తి), పి. రుష్మిత (నారాయణరావుపేట), వై. హేమశ్రీ (నలంద హైస్కూల్ గజ్వేల్), ఎ. లిఖిత (నారాయణరావుపేట), బి. మనస్విని (ఎస్ఆర్ హైస్కూల్, సిద్దిపేట).

ఎబోవ్ 18 సుపైన్ ఇండివిడ్యువల్ యోగాసన: మౌనిక (నర్సింగ్ కాలేజీ), పి. అను (నర్సింగ్ కాలేజీ), జి. సంధ్య (నర్సింగ్ కాలేజీ), సిహెచ్. హర్షిత (నర్సింగ్ కాలేజీ), జి. ప్రణవి (నర్సింగ్ కాలేజీ).

రెండోసారి సైకిల్‌పై..

● సతీమణితో కలిసి 22 కి.మీ. ప్రయాణించిన మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

● ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



రామాయంపేటకు సైకిల్‌పై వస్తున్న కలెక్టర్ దంపతులు

రామాయంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ మరోసారి ప్రత్యేక శైలిని చాటుకున్నారు. ఆదివారం ఉదయం తన భార్య శ్రీజతో కలిసి మెదక్ నుంచి రామాయంపేట వరకు 22 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణించి అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంటపాటు ఆసుపత్రిలో గడిపి సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రసవాలు జరగడం లేదని గుర్తించి, వెంటనే గైనకాలజిస్ట్ పోస్టు భర్తీ చేస్తామని ప్రకటించారు. అంతేకాకుండా, వైద్య సిబ్బంది హాజరు, మందుల నిల్వలను తనిఖీ చేసి, రోగికి



రామాయంపేట ఆసుపత్రిలో మందుల నిల్వలు చూస్తున్న కలెక్టర్

చేసే పరీక్షల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని డాక్టర్ నిహారికకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కలెక్టర్, ఈ సీజన్‌లో మలేరియా కేసులు నమోదు కాలేదని, డెంగ్యూ కేసులు ప్రమాద స్థాయిలో లేవని స్పష్టం చేశారు. మెదక్-రామాయంపేట హైవే పనుల భద్రతపై సంబంధిత అధికారులతో చర్చిస్తానని తెలిపారు.

గతంలో కూడా..

గతంలో కూడా రాహుల్ రాజ్ పొలం బాట, కాలినడక, సైకిల్ ప్రయాణం వంటి ప్రత్యేక పద్ధతులతో ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. గత మార్చి నెలలో కూడా ఆయన 22 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణించి బస్టాండ్ సమస్యలను తెలుసుకున్నారు. అలాగే, దంతేపల్లి ఫారెస్ట్‌లో కాలినడకన వెళ్లి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ విధంగా ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయం.

కథల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న అభిజ్ఞ, అఖిల

కొండపాక/ చిన్నకోడూరు/ సిద్దిపేట అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మాచిరాజు బాల సాహిత్య పీఠం నిర్వహించిన కథల పోటీల్లో సిద్దిపేట జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బక్రీ చెప్యాల ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థిని జక్కుల లోహిత, కొండపాక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని పి.అభిజ్ఞ, చిన్నకోడూరు మండలం అనంతసాగర్ జడ్పీ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని బి.అఖిలకు పురస్కారాలు లభించాయి. వీరికి ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, నేషనల్ బుక్ ట్రస్ట్ సభ్యుడు పత్తిపాక మోహన్ నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందజేశారు.

బాలకథా చంద్రిక పుస్తకావిష్కరణ

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం రచించిన 'బాలకథా చంద్రిక' పుస్తకాన్ని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆవిష్కరించారు. చందమామ కథా రచయిత మాచిరాజు కామేశ్వరరావు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, రచయితలు పైడిమర్రి రామకృష్ణ, చంద్రప్రతాప్, ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి, బూర్ల నాగేశ్వరరావు, పుప్పాల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు

● ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నారాయణఖేడ్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు తప్పవని సీపీఐ రాష్ట్ర నాయకులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం నారాయణఖేడ్‌లో జరిగిన సీపీఐ జిల్లా నాలుగో మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి రాష్ట్రపతికి పంపినప్పటికీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వార్థ రాజకీయాల కోసం దాన్ని అడ్డుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రపతి ఈ బిల్లును ఆమోదించాల్సిన అవసరం ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తప్పు చేసినవారు ఎంతటివారైనా ఉపేక్షించవద్దని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశానికి జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ అధ్యక్షత వహించగా, జిల్లా ఇన్‌చార్జి నర్సింహా, రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు మందపవన్, రాష్ట్ర నాయకులు ప్రకాష్‌రావు, జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్, కార్యవర్గ సభ్యులు రెహమాన్, తాజోద్దీన్, దత్తురెడ్డి, మహబూబ్‌ఖాన్, రుబీనా, కౌన్సిల్ సభ్యులు చిరంజీవి, అశోక్, ఈసాక్, లింగం, సతీష్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

యూరియా కావాలయ్యా!

(5వ పేజీ తరువాయి)

చూస్తున్నారు. అయితే పంటలు సాగు చేసిన రైతులకు యూరియా గండం ఏర్పడుతోంది.

అధిక ధర.. అడ్డగోలు లింకులు

- సంగారెడ్డి పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నారని ఒక షాపు పై కేసు నమోదు చేశారు
- చేర్యాలలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ప్రస్తుతానికి యూరియా స్టాకు లేదు. వ్యాగన్ రానందున ఉన్న స్టాకును ఆగ్రోస్, పీఏసీఎస్ సొసైటీలకు తరలించారు.
- కొల్చారం మండలం దుంపలకుంటలో యూరియా కావాలంటే గుళికలు లేదా ఫాస్పేట్ లింకు పెడుతున్నారు. ఇదే మండలంలోని పలు షాపుల్లో రూ.300కుపైగా ఒక యూరియా బస్తా విక్రయిస్తున్నారు.
- మునిపల్లి మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో యూరియా లభించడం లేదు. రెండో దఫా చల్లడానికి యూరియా అందుబాటులో లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు.
- మనోహరబాద్ మండలంలో యూరియా కొరత దృష్ట్యా ఒక ఎకరం ఉన్న వారికి రెండు బస్తాల యూరియా మాత్రమే ఇస్తున్నారు.
- చిన్నకోడూరులో రూ.270 నుంచి రూ.280 వరకు ఒక బస్తా యూరియా విక్రయిస్తున్నారు.
- తొగుట మండలంలోని సొసైటీల్లో బస్తాకు రూ.280 వసూలు చేస్తుండగా ప్రైవేట్ షాపుల్లో రూ.290 దాకా తీసుకుంటున్నారు.
- ములుగు మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో యూరియా కొరత ఉంది. పాస్‌బుక్ ఉన్న రైతుకు 2 బస్తాలకు మించి ఇవ్వడం లేదు.
- కౌడిపల్లి మండలంలో అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నారని రైతులు ఫిర్యాదు చేయడంతో భాగ్యలక్ష్మి ట్రేడర్స్ దుకాణానికి స్టాప్ సేల్స్ విధిస్తూ వ్యవసాయాధికారి నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసును నాలుగు రోజులపాటు గోప్యంగా ఉంచారు. మిగతా షాపుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.
- కుకునూరుపల్లి మండలంలో ఎకరాకు ఒక బస్తా యూరియా మాత్రమే విక్రయిస్తున్నారు.
- సిద్దిపేట అర్బన్, రూరల్ మండలాల్లో యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



తొగుట సొసైటీ కార్యాలయానికి యూరియా కోసం వచ్చిన రైతులు

వానొస్తే ఆగమే..

సమృద్ధిగా వర్షాలు కురిస్తే యూరియా కోసం రైతులు రోడ్డెక్కే పరిస్థితి వస్తుందనే అంచనాలు నెలకొన్నాయి. ఎందుకంటే వానాకాలం సీజన్‌లో సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల నుంచి యూరియా కోసం అంచనా నివేదిక పంపించారు. ఆయా జిల్లాల్లో సాగవుతున్న పంటల దృష్ట్యా ఎంత యూరియా కావాలనే విషయాన్ని పైకి తెలిపారు. కానీ ఇప్పటివరకు జిల్లాకు కేటాయించిన యూరియా నిల్వలతో వానాకాలం సీజన్ గట్టెక్కే పరిస్థితి కనిపించడం లేదు. ఎందుకంటే అంచనాలో సగం వరకే యూరియా నిల్వలు కేటాయించారు. మూడు జిల్లాల్లో 1,04,772 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా 52,862 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. చాలా దుకాణాల్లో స్టాకు లేదనే చెబుతున్నారు. మొన్నటి దాకా తొలి దఫా యూరియాను వినియోగించారు. ఈనెలలో వరికి పెద్దఎత్తున యూరియా అవసరం పడుతుంది. మొక్కజొన్న, పత్తికి వినియోగించాల్సిన పరిస్థితి. వర్షం పడిందంటే రైతులంతా యూరియా వైపు పరుగులు పెడతారు. అందుకే అధికార యంత్రాంగం అప్రమత్తం కావాల్సిన ఆవశ్యకత ఉంది.

పడకేసిన పారిశుధ్యం


దౌల్తాబాద్: మండల ప్రజా పరిషత్ కార్యాలయం


గతంలో గాజులపల్లిలో ఫాగింగ్ చేస్తున్న దృశ్యం(ఫైల్)

- దౌల్తాబాద్ మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న చెత్త, మురుగునీరు
- దోమల బెడదతో ప్రజలు సతమతం
- నాలుగు ఫాగింగ్ మిషన్లు ఉన్నా స్టోర్‌రూమ్‌కే పరిమితం
- సిబ్బంది కొరతతో తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని మండల అధికారులు

దౌల్తాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అసలే వర్షాకాలం.. ఖాళీ స్థలాల్లో నిలిచిన మురుగునీరు.. పేరుకుపోయిన చెత్తాచెదారం.. ఇదీ చాలదన్నట్టుగా పందులు, కుక్కలు, దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి అయ్యిందంటే చాలు గ్రామాల్లో ప్రజలు దోమల బెడదతో సతమతమవుతున్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో అధికారులు ఫాగింగ్ చేయడం లేదు. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. పారిశుధ్యం పడకేసినా మండలస్థాయి అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

స్టోర్‌రూమ్‌కే పరిమితమైన ఫాగింగ్ మిషన్లు

దౌల్తాబాద్ మండలంలో 25 గ్రామపంచాయతీల పరిధిలో 32 వేల పైగా జనాభా నివసిస్తున్నారు. మండలంలో నాలుగు ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి. వాటిని ప్రతి ఏటా ఒకటి లేదా రెండుసార్ల కంటే ఎక్కువ ఉపయోగించిన సందర్భాలు లేవు. సరిపడా సిబ్బంది, వాహనాలు లేకపోవడం వల్లే వాటిని సక్రమంగా నిర్వహించడం లేదని తెలుస్తోంది. ఫాగింగ్ మిషన్ల నిర్వహణకు ప్రత్యేకంగా ఇద్దరు సిబ్బందిని నియమిస్తే వారు క్రమం తప్పకుండా అన్ని గ్రామాల్లో ఫాగింగ్ చేసే అవకాశం ఉంటుంది. కానీ ఫాగింగ్ చేయడానికి సిబ్బందిని నియమించకుండా తూతూ మంత్రంగా పనులు కానిచ్చేస్తున్నారు. దీంతో ఫాగింగ్ మిషన్లు మండల కార్యాలయంలోని స్టోర్ గదికే పరిమితమయ్యాయి. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లిన పాపాన పోలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దోమల బెడదతో కంటికి కునుకే కరువు

దోమల వ్యాప్తి పెరగడంతో రాత్రి వేళలో కంటి మీద కునుకు లేకుండా పోతుంది. దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజులపల్లి, దొమ్మాట, సూరంపల్లి, లింగరాజ్‌పల్లి, ముబ్బరాస్‌పూర్, తిరుమలపూర్, హైమద్ నగర్, మహమ్మద్ షాపూర్, గొడుగుపల్లి, ఉప్పరపల్లి, గోవిందపూర్ తదితర గ్రామాల్లో కాలనీల్లో రాత్రి, పగలు అనే తేడా లేకుండా దోమల బెడదతో సతమతమవుతున్నారు.

రెండు నెలలుగా ఫాగింగ్ లేదు



డ్రైనేజీలను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం లేదు. మురుగు నీరు నిల్వ ఉండటం వలన దోమల వృద్ధి చెందడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అన్ని రకాల పన్నులను వసూలు చేస్తున్న అధికారులు గ్రామాల్లో ఫాగింగ్, పారిశుధ్యం పనుల్లో అలసత్వం వహిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా నేటివరకు ఒక్కసారి కూడా ఫాగింగ్ చెయ్యలేదు.

-దేవుడి లావణ్య, బీజేపీ మండల అధ్యక్షురాలు

న్యూస్ బాక్స్

హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు


శ్రీదేవి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

హుస్నాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. పాలిసెట్ -25 ఉత్తీర్ణులైన విద్యార్థులు, పాలిసెట్-25 ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు, పాలిసెట్ - 25కు హాజరుకాని విద్యార్థులు కూడా అర్హులని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లకు 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. 11వ తేదీన ఎంపిక ప్రక్రియ పూర్తవుతుందన్నారు. వివరాల కోసం హుస్నాబాద్ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలన్నారు.

మృతుల కుటుంబాలకు చేయూత

తొగుట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు బండారు మహేశ్ కుటుంబాన్ని ఆదివారం బీజేపీ సీనియర్ నాయకులు వెంకట్రాముల బాల్‌రెడ్డి పరామర్శించి బియ్యం, నగదును అందజేశారు. మెదక్ ఎంపీ రఘునందర్‌రావు సహకారంతో బాధిత రైతు కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు లింగం, రాజు, మల్లేశం, దుర్గాప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● **కొమురవెల్లి:** మండలంలోని అయినపూర్ గ్రామానికి చెందిన సురగోని నర్సమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ బొంగు రాజేందర్ రెడ్డి మృతురాల కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. వెంట నాయకులు మేర్గు కృష్ణగౌడ్, పచ్చిమడ్ల స్వామిగౌడ్, గోపాల్ రెడ్డి, బూర్గు స్వామిగౌడ్, దుర్గారెడ్డి, సుధాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

● **రాయపోల్**: రాయపోల్ గ్రామానికి చెందిన గల్వ సత్తిరెడ్డి ఇటీవల నార్సింగ్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 1993 వ తరగతి బ్యాచ్ స్నేహితులు కలిసి బాధిత కుటుంబ సభ్యులకు 51వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. బాల్య స్నేహితులు దరువు అంజన్న, గుమ్మల్ల అశోక్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, సోమేశ్వర్ పంతులు, కమ్మరి యాదగిరి, సత్తుగారి మహేందర్ రెడ్డి, లొట్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మద్దూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : దూళిమిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం జిల్లా కేంద్రానికి చెందిన మంజునాథ ఆస్పత్రి సహకారంతో ఎల్‌డీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ వైద్యశిబిరానికి పెద్దఎత్తున తరలివచ్చారు. పంచాయతీ కార్యదర్శి ప్రారంభించిన ఈ శిబిరంలో వైద్యాధికారులు సాయిశ్రీ, రవితేజ, ప్రశాంత్ వైద్య ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా సుమారు 170 మందిని పరీక్షించి మందులు అందజేశారు. ఎల్‌డీఎఫ్ సభ్యులు తాటికొండ నవీన్, గద్దల మహేందర్, శిరీష, పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలి

నంగునూరు,ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలో కొనసాగుతున్న మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని వెంటనే రద్దు చేసి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు దేవులపల్లి రాజమౌళి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రవికుమార్ పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని తీసుకొచ్చి గ్రామపంచాయతీ కార్మికులను వర్కర్లుగా చేసిందని, ఉద్యోగ భద్రత కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మల్టీ పర్పస్ వర్కర్ విధానం వల్ల గతంలో పనిచేసిన కారోబార్, బిల్ కలెక్టర్లు, స్వీపర్లు, పంప్ ఆపరేటర్లు తదితర అనేక విభాగాల్లో పనిచేసిన వారు ప్రస్తుతం ట్రాక్టర్ నిర్వహణలోకాని కరెంటు సరఫరాలో పని చేస్తున్నారన్నారు. జీవో 51ను సవరించి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామ పంచాయతీ నంగునూరు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దేవులపల్లి రాజమౌళి, ప్రధాన కార్యదర్శిగా చిట్యాల కనకయ్య, కోశాధికారిగా పిల్లి రవీందర్, ఉపాధ్యక్షులుగా జీడి కంటి కనకవ్వ, దేవులపల్లి రేణుక, ముంద్రాతి కనకయ్య, సహాయ కార్యదర్శిగా బెల్లం బాలయ్య, బాల్ నర్సవ్వ, యాదవ్వతో పాటు మరో పదిమందిని కమిటీ సభ్యులుగా నియమించినట్టు తెలిపారు.

ఘనంగా బాలాజీ వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు


హోమగుండానికి పుట్టమట్టిని తీసుకుని వస్తున్న ఆలయ బాధ్యులు

దుబ్బాక, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దుబ్బాకలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతిష్ఠాత్మకంగా నాలుగేళ్లక్రితం నిర్మించిన ఆలయం చతుర్థ వార్షికోత్సవాన్ని ఆదివారం ప్రారంభించారు. ఉదయం పుణ్యాహావాచనం, అంకురార్పణతో మొదలైన పూజలు, యాగశాల నిర్మాణానికి పుట్టమట్టిని తీసుకుని వచ్చారు. మేలతాళాలతో పుట్టవద్దకు వెళ్లి పుట్టమట్టిని తెచ్చారు. స్వామి ఎదుర్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఆర్, రాజమౌళి, వడ్లకొండ శ్రీధర్, చింతరాజు, కూరవేణుగోపాల్ తదితరులున్నారు.

రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా?

● తొగుట సొసైటీ చైర్మన్

తొగుట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రైతుల పంటలకు సరిపడా యూరియా లేక ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చేష్టలుడిగి చూడటం సిగ్గుచేటని తొగుట కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి మండిపడ్డారు. ఆదివారం మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యూరియా పంపిణీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల కష్టాలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం రైతుల కష్టాలు పట్టించుకోకపోతే వారి పక్షాన సొసైటీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో గంగారెడ్డి, డైరెక్టర్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ వేల్పులస్వామి, మాజీ సర్పంచ్ నర్సింలు, ఏఈవో నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడదు


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి

సిద్దిపేట ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ బెదిరింపులకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎవరూ భయపడరని బీఆర్ఎస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో రేషన్‌కార్డులు ఇప్పటివరకు ఇయ్యలేదని కాంగ్రెస్ నాయకులు అబద్దాలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మీ పార్టీలో బినామి రేషన్‌డీలర్లు ఉన్నారని, మీ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బీఆర్ఎస్ హయాంలో 6.40 లక్షల రేషన్‌కార్డులు ఇచ్చినట్లు చెప్పారని తెలిపారు. సిద్దిపేటలో మూడు దఫాలుగా ఇళ్లు కట్టించామని, ఇళ్ల స్థలాలు కూడా ఇచ్చామని చెప్పారు. 2,200 డబుల్ బెడ్ రూమ్‌లను అర్హులైన వారికి మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అందజేసినట్లు వివరించారు. మీ ప్రభుత్వంలో డబ్బులివ్వనిదే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం లేదని, వాటి ఆధారాలను త్వరలోనే వాటిని బయటపెడుతామని హెచ్చరించారు. సిద్దిపేట ప్రజలు త్వరలోనే కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మోహీజ్, హైమద్, సందీప్, సాయిప్రేమ్, రాములు, చాంద్, నరేష్, సతీష్, దరిపల్లి శ్రీను,శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న భక్తులకు సౌకర్యాలు కల్పించండి


ఈవో అన్నపూర్ణకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కొమురవెల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న భక్తులకు పలు సౌకర్యాలు కల్పించాలనీ కోరుతూ ఆదివారం బీజేపీ మండల అధ్యక్షురాలు బూర్గోజు స్వరూప అధ్వర్యంలో నాయకులు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణకు వినతి పత్రం అందించారు. రాబోయే కల్యాణం నాటికి భక్తులకు క్యూ కాంప్లెక్స్, 50 గదుల సత్రం అందుబాటులోకి తీసుకురావాలనీ కోరారు. ఆలయ పరిసర ప్రాంతంలో ఉన్న భూములకు ప్రహరీ నిర్మించి కబ్జాలకు గురికాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మహజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ బీజేపీ సుపరిపాలనను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి బొడుగం కృష్ణారెడ్డి, గొల్లపల్లి మల్లికార్జున్, పబ్బోజు రాజుచారి, మద్దికుంట కరుణాకర్, ఈగ కనకయ్య, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట దశకు అనుగుణంగా యూరియా వాడాలి


యూరియా విక్రయించిన రికార్డులను పరిశీలిస్తున్న ఏవో నరేష్

సిద్దిపేట రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పంట దశను బట్టి రైతు సోదరులు యూరియా వాడకం అలవాటు చేసుకోవాలని ఏవో నరేష్ రైతులకు సూచించారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో, రాఘవాపూర్ డీసీఎంఎస్‌లో యూరియా సరఫరాను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం నుంచి ముఖ్యంగా బుస్సాపూర్, వెంకటాపూర్ తోర్నాల, ఇర్కోడు గ్రామాల రైతులు ఎరువులను అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. రైతులు అధిక యూరియా వాడడం వల్ల పంటలలో పురుగులు, తెగులు ఉధృతి పెరుగుతుందన్నారు. కాబట్టి అవసరం మేరకే యూరియా తీసుకోవాలని సూచించారు. సిద్దిపేట మండలంలో గత రెండు రోజులుగా 50 టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. మొక్కజొన్న, పత్తి పంట సాగు చేస్తున్న రైతులు నానో యూరియాను పిచికారి చేసుకోవడం వల్ల లాభాలు మెండుగా ఉన్నాయని వివరించారు.

రాష్ట్రాన్ని దివాలాతీయిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం


గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్నదని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఎన్నికల ముందు ఇష్టారీతిన హామీలను ఇచ్చిన ప్రస్తుతం వాటిని తుంగలో తొక్కిందని, 20నెలల్లో రూ.2లక్షల కోట్ల అప్పు తీసుకువచ్చి ప్రజలకు పనికి వచ్చే ఒక్క పని కూడా చేయలేదన్నారు.

రాష్ట్రంలో రైతాంగానికి యూరియా లేక పాసుపుస్తకాలు పట్టుకుని కుటుంబం మొత్తం రోడ్డు మీదకి వస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎనిమిది మంది చొప్పున బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఎంపీలు ఉన్నా, రాష్ట్రానికి రావాల్సిన విభజన హక్కులపై మాట్లాడే నాథుడే లేరన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు కుమ్మక్కై రాష్ట్రాన్ని దివాళా తీయిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాలు కాకుండా రాష్ట్ర ప్రయెజనాలకు పెద్దపీట వేయాలని హితవు పలికారు.

ఆయన వెంట ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, పట్టణ బీఆర్ఎస్ శాఖ అధ్యక్షుడు నవాజ్ మీరా, నాయకులు మర్కంటి కనకయ్య, రాంచంద్రం, స్వామిచారి, యాదగిరి, వెంకటేశ్, మల్లేశ్, కళ్యాణ్ తదితరులున్నారు.

ఉషోదయ యూత్ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన యూత్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

కొండపాక, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెడ గ్రామానికి చెందిన ఉషోదయ యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వడ్లకొండ సోమేష్, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ షాదుల్లా, ప్రధాన కార్యదర్శిగా కోణం శ్రీకాంత్, కోశాధికారిగా షాదుల్ హుస్సేన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా కాసాని మహేందర్‌రెడ్డి, పెద్ది నాగరాజు, పొన్నం వెంకటేశం వ్యవహరించారు.

హుస్నాబాద్‌లో మహాసంపర్క్ అభియాన్


కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని 13వ వార్డులో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇంటింటికీ బీజేపీ.. ప్రతీ ఇంటికి పోలింగ్ బూత్ అధ్యక్షులు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. బీసీ రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ నాటకం ఆడుతుందన్నారు. మతపరమైన రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం చేయాలని చూస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, వరికోలు నాగరాజు, నాయకులు గొళ్లపల్లి వీరాచారి, బోడిగ వెంకటేశ్, గాదాసు రాంప్రసాద్, సాయిరామ్, తదితరులున్నారు.

కార్మిక కోడ్‌లను రద్దు చేయాలి



గజ్వేల్ సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎల్లయ్య

గజ్వేల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కార్మిక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సత్య సూర్య అల్యూమినియం ఎంప్లాయీస్ సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. నూతనంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక కోడ్‌ల ఫలితంగా పరిశ్రమల్లో కార్మిక సంఘాలు లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. కార్మికులను ఎలాంటి రక్షణ లేకుండా నియమించే విధంగా కోడ్‌ల రూపకల్పన ఉందన్నారు. ఆయన వెంట సీఐటీయూ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మల్లన్నసాగర్‌కు ఎల్లంపల్లి నీళ్లు

(5వ పేజీ తరువాయి)

మాజీ చైర్మన్లు మడుపు భూంరెడ్డి, గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి, గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మంత్రి వివేక్ సుడిగాలి పర్యటన

ములుగు/మర్కుక్/వర్గల్/జగదేవ్‌పూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గంలో ఆదివారం రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి సుడిగాలి పర్యటన నిర్వహించారు. గజ్వేల్- ప్రజ్ఞాపూర్‌తో పాటు ములుగు, మర్కుక్, జగదేవ్‌పూర్ మండల కేంద్రాల్లో, వర్గల్ మండలంలోని శాఖారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాల్లో లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డుల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా నూతనంగా ఎంతమందికి రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్నామో వివరించారు. రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తున్నదని తెలిపారు. రాష్ట్ర అప్పులపాలైన ఏ పథకం ఆగకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఎండగట్టారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. ములుగులో సమావేశం అనంతరం మహిళలతో పథకాలు అందుతున్నాయా అని మహిళలతో మంత్రి వివేక్ ముచ్చటించారు. రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని జగదేవ్‌పూర్‌లో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చెక్కల రమేష్ ఆధ్వర్యంలో మంత్రి వివేక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.


హుస్నాబాద్: ధర్మవీర్ యోగ శిక్షణ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం

ఘనంగా స్నేహితుల దినోత్సవం



సిద్దిపేటలో స్నేహితులతో మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్



కోహెడ: బస్వాపూర్‌లో చిన్నారుల సందడి

హుస్నాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. హుస్నాబాద్ పట్టణంలో ధర్మవీర్ యోగ శిక్షణ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహితులు చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజిత, మాజీ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, చిత్తారి పద్మ, వాల సుప్రజ, బోజు రమాదేవి, హేమలత, వనజ తదితరులున్నారు. అలాగే 1987-88 హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బ్యాచ్‌కు చెందిన మిత్రులు ఈ వేడుకల సందర్భంగా ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ ధరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ తాళ్లపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి మహేందర్, అయిత శ్రీధర్ తదితరులున్నారు.

● **సిద్దిపేట కల్చరల్:** సిద్దిపేటలోని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ నివాసంలో ఫ్రెండ్‌షిప్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. తన చిన్ననాటి మిత్రులతో సరదాగా గడిపారు. మిత్రులకు శాలువాలు, పూలదండలతో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. మిత్రులందరు కలిసి ఫారూఖ్ హుస్సేన్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఫారూఖ్ హుస్సేన్ మాట్లాడుతూ స్నేహంలో కుల మతాలకు, రాజకీయాలకు తావుండదన్నారు.

● **కోహెడ:** మండలంలో స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కుల, మతాలు వేరైనా మేమంతా ఒక్కటే అంటూ బస్వాపూర్‌లో చిన్నారులు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ను కట్టుకున్నారు.

ఇందిరమ్మ రాజ్యస్థాపనకు ప్రభుత్వం కృషి


ఇందిరమ్మ ఇంటి పనులు ప్రారంభిస్తున్న కొమ్ము నర్సింగరావు

చేర్యాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ రాజ్యస్థాపనకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని చేర్యాల మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు పేర్కొన్నారు. చేర్యాల మండలకేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో ఆదివారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులు ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజాపాలనలో పేదలు సుభిక్షంగా జీవిస్తున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్‌కు అండగా ఉంటారని ధీమావ్యక్తం చేశారు.

డివిజన్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ కార్యవర్గం

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ డివిజన్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముక్కెర రాజు యాదవ్, ఉపాధ్యక్షుడిగా ముక్కెర శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బైరగోని రాము, సహాయ కార్యదర్శిగా బోయిని తిరుపతి, ప్రచార కార్యదర్శిగా పచ్చిమట్ల శ్రీకాంత్, కోశాధికారిగా కొడముంజ రాజ్‌కుమార్, గౌరవ సలహాదారులుగా తాడూరి సురేష్, గూళ్ల రవికుమార్‌లను ఎన్నుకున్నారు.

మంత్రి సభలో రసాభాస

(5వ పేజీ తరువాయి)

వెళ్లి మాట్లాడుతుండగా, ఆయన వెంటే కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము విజయ్‌కుమార్, మరో ముగ్గురు ఉన్నారు. స్టేజీ అవతలి వైపు నుంచి ఇటువైపునకు దూసుకువచ్చిన నర్సారెడ్డి వర్గీయులు వారిని తోసివేసే ప్రయత్నం చేశారు. ఈ తోపులాటలో నర్సారెడ్డి వ్యతిరేక వర్గీయుల దుస్తులు చిరిగాయి. వెంటనే వారిని పోలీసులు అక్కడి నుంచి పంపించి వేసే ప్రయత్నం చేశారు. అప్పటికే నర్సారెడ్డి గందరగోళం వద్దని, శాంతించాలని చెప్పినప్పటికీ ఇరు వర్గాలు వినలేదు. దీంతో మంత్రి వివేక్ వెంకటస్వామి కల్పించుకుని నర్సారెడ్డి ఏ బంద్ కరో భాయ్ అంటూ సూచించారు. అంతేకాకుండా ప్రభుత్వ కార్యక్రమం అని, మనం బయట మాట్లాడుకుందామని చెప్పడంతో అంతా శాంతించారు. ఈ క్రమంలోనే నర్సారెడ్డి వ్యతిరేక వర్గీయులను అక్కడి నుంచి పోలీసులు పంపించివేశారు. కార్యక్రమం అనంతరం ఆత్మ కమిటీ గజ్వేల్ డివిజన్ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము విజయ్‌కుమార్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తర్వాత గజ్వేల్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద నర్సారెడ్డి డౌన్ డౌన్ అని, నర్సారెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. తనపై దాడి జరిగిన విషయంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు కొమ్ము విజయ్ కుమార్ తెలిపారు.